

గద్వాలలో ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించినందుకు జరిమానా విధిస్తున్న ట్రాఫిక్ పోలీసు(ఫైల్)

'డాడీ నాకు ఇంటర్ పరీక్షలు అయిపోయాయి.. మా ఫ్రెండ్స్ అందరు కలిసి బైక్‌లపై పిక్నిక్‌కు వెళ్లాలనుకుంటున్నాం.'
- అని కొడుకు తండ్రిని గోముగా అడిగి బైక్‌ను తీసుకెళ్లడం మనం చూస్తుంటాం.

'మమ్మీ మా ఫ్రెండ్స్ అందరూ స్కూటీల మీద వస్తుంటారు. డాడీని అడిగి ఒక స్కూటీ కొనివ్వు..'
- అని కూతురు తల్లిని అడగటం గమనిస్తుంటాం.

పిల్లలు అలా అడిగిన వెంటనే తల్లిదండ్రులు మమకారంతో వారి వయస్సును పట్టించుకోకుండా బైక్‌లు, స్కూటీలు ఇప్పిస్తుంటారు. డ్రైవింగ్ లైసెన్స్‌లు లేకుండా వారు వచ్చీరాని డ్రైవింగ్‌తో రోడ్లపై వాహనాలు నడిపి, ప్రమాదాలకు కారణమవుతున్నారు. అతివేగం, ట్రాఫిక్ నియమాల ఉల్లంఘన కారణంగా జోగుళాంబ గద్వాల జిల్లాలో గత ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు 26,512 కేసులు నమోదయ్యాయి.

- గద్వాల క్రైం



26,512

అతివేగం, ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలపై జోగులాంబ గద్వాల జిల్లాలో నమోదైన కేసుల సంఖ్య ఇది..

- మైనర్లు, యువత ర్యాష్ డ్రైవింగే కారణం
- 470 డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు

జోగులాంబ గద్వాల జిల్లాలో మైనర్లు, యువత వల్ల రోడ్డు ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయి. మైనర్లు బైక్‌లు, స్కూటీలు అతివేగంగా నడుపుతుండగా, యువత వాహనాలపై విన్యాసాలు చేస్తున్నారు. దాంతో ప్రమాదాలకు కారణమవుతున్నారు. పట్టణంలోని కృష్ణానది రూట్‌లో యువకులు వేగంగా వాహనాలు నడుపుతూ బాటసారులు, ఇతర వాహనదారులను ప్రమాదాలకు గురి చేస్తున్నారు. ఇక్కడ బైక్ రైడింగ్‌లు కూడా నిర్వహిస్తున్నారు. గద్వాల పట్టణంలో గతంలో ఓ మైనర్ బైక్‌పై వేగంగా వెళ్తూ, సుంకులమ్మ గుడి ఎదురుగా ఓ వృద్ధుడిని ఢీకొట్టాడు. చికిత్స పొందుతూ ఆ వృద్ధుడు చనిపోయాడు. మండల పరిధిలోని జమ్మిచేడు సమీపంలో మరో మైనర్ బైక్ వేగంగా నడుపుతూ, ఎదురుగా వస్తున్న మరో బైక్‌ను ఢీకొనడంతో ఆ బైక్‌పై ఉన్న ఓ మహిళకు తీవ్ర గాయాలయ్యాయి.

అతివేగం వల్లే ప్రమాదాలు

అతివేగం, మద్యం మత్తు, ట్రాఫిక్ నియమాల ఉల్లంఘ వల్ల రోడ్డు ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయి. వాహనదారులు పరిమిత వేగంతో వాహనాలు నడపాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, మద్యం సేవించి వాహనాలు నడుపొద్దని పోలీసులు చెబుతున్నారు. అప్పుడే ప్రమాదాలబారిన పడకుండా ఉంటారని అంటున్నారు.

అవగాహన కల్పిస్తున్నా..

జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలో గత ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు అతివేగం, ట్రాఫిక్ నియమాల ఉల్లంఘణకు సంబంధించి 26,512 కేసులను నమోదు చేసినట్లు ట్రాఫిక్ ఎస్‌ఐ విజయభాస్కర్ తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపినందుకు 470 మందిపై కేసులు నమోదు చేశామన్నారు. ప్రమాదాల బారిన పడకుండా జిల్లా కేంద్రంలోని ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో 50 అవగాహన కార్యక్రమాలను ఎస్పీ రితిరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించామని తెలిపారు.

కేసులు తప్పవు

మైనర్లకు వాహనాలు ఇస్తే పేరెంట్స్‌పై కేసులు తప్పవని ట్రాఫిక్ ఎస్‌ఐ విజయభాస్కర్ చెబుతున్నారు. మైనర్లు వాహనాలు నడిపితే మొదటి తప్పుగా భావించి 180 ఎంవీ చట్టం ప్రకారం రూ.1,000 జరిమానా విధిస్తామన్నారు. మళ్లీ వాహనాలు నడిపితే వారిని కోర్టుకు పంపే అవకాశాలు ఉన్నాయన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని అవగాహన కల్పిస్తున్నా.. పట్టించుకోవడం లేదని అంటున్నారు.



ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఎస్‌ఐ విజయభాస్కర్(ఫైల్)

మైనర్లకు వాహనాలిస్తే ముప్పు తప్పదు

తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇవ్వడం మానుకోకపోతే ముప్పు తప్పదు. వారి వల్ల ఎదురుగా వస్తున్న వారూ ప్రాణాలు కోల్పోయే పరిస్థితి ఏర్పడుతుంది. వాహనదారులు అతివేగంతో, మద్యం సేవించి వాహనాలు నడుపొద్దు. అలా చేస్తే మీరు ప్రమాదంలో పడి, మీ కుటుంబం రోడ్డున పడుతుందని గమనించాలి. ట్రాఫిక్ నియమాలు పాటించి, ప్రమాదాల నివారణకు కృషి చేయాలి.

- విజయభాస్కర్, ట్రాఫిక్ ఎస్‌ఐ, గద్వాల

బస్సు వంతెన మూసివేత

- బ్రిడ్జికి మరమ్మతుల నేపథ్యంలో బంద్
- బారికేడ్లు అడ్డంపెట్టి వాహనాల దారి మళ్లింపు
- నదిలో కాలిబాటకు అనుమతించని కర్ణాటక ప్రభుత్వం



మరమ్మతులు చేసేందుకు వంతెనపై సీసీ రోడ్డును తొలగిస్తున్న కార్మికులు

కృష్ణ, జనవరి 17: నారాయణపేట జిల్లా కృష్ణ మండలం గుడెబల్లూరు గ్రామ శివారులో 167వ నెంబర్ జాతీయ రహదారిలో కృష్ణానదిపై ఉన్న బస్సు వంతెనను బుధవారం మూసేశారు. బ్రిడ్జికి కర్ణాటక ప్రభుత్వం మరమ్మతులు చేస్తున్న నేపథ్యంలో కృష్ణ ఎస్‌ఐ విజయభాస్కర్ సిబ్బందితో కలిసి ఉదయం ఆరు గంటలకు బ్రిడ్జికి అడ్డంగా బారికేడ్లను పెట్టి, వాహనాలను దారి మళ్లించారు. బ్రిడ్జిపై ఇనుప చువ్వలు తేలడంతో సీసీని తొలగించి, తిరిగి కొత్తగా సీసీరోడ్డు వేయనున్నారు. బ్రిడ్జిని మూసేయడంతో కర్ణాటకలోని ప్రైవేటు కంపెనీలలో మంగళవారం రాత్రి విధులు నిర్వహించిన మండలానికి చెందిన వారు తెల్లవారుజామున బ్రిడ్జి అవతలి వైపునకు వాహనాల్లో వచ్చి, అక్కడి నుంచి బ్రిడ్జిపై కాలినడక ద్వారా ఇవతలి వైపునకు వచ్చారు. తర్వాత ఇక్కడి వాహనాల్లో వెళ్లారు. కర్ణాటకలోని దేవసూగూరుకు విద్యార్థులు చదువుకోడానికి, రైతులు పాలుపోయడానికి, ఇతర అవసరాలకు ప్రజలు రోజూ వచ్చి పోతారు. ఈ నేపథ్యంలో నదిలో కొత్త బ్రిడ్జి నిర్మాణం కోసం టిప్పర్లు తిరగడానికి కర్ణాటక కాంట్రాక్టర్ వేసిన మొర్రం రోడ్డు గుండా కాలినడకన వచ్చి వెళ్లేందుకు తమకు అనుమతించాలని మండల ప్రజలు సీఐ రాంలాల్‌నాయక్‌ను కోరారు. అందుకు సీఐ ఒప్పుకోలేదు. రాయిచూరు జిల్లా కలెక్టర్ అనుమతి ఇస్తే తప్ప వెళ్లడానికి అవకాశం లేదని చెప్పారు. వంతెనపై రాకపోకలు నిలిపేయడంతో హైదరాబాద్ నుంచి రాయచూరు వెళ్లేందుకు వచ్చిన బస్సులు టై రోడ్డు వద్దకు వచ్చి, తిరిగి హైదరాబాద్ వెళ్తున్నాయి. బ్రిడ్జిని బంద్ చేయడంతో టై రోడ్డు వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.



టైరోడ్డు వద్ద వాహనాలను దారి మళ్లించేందుకు నియమితులైన పోలీసులు

నేడు సింగోటం లక్ష్మీనరసింహస్వామి రథోత్సవం



విద్యుత్ దీపాల వెలుగులో ఆలయం

కొల్లాపూర్, జనవరి 17: సింగోటం లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం సాయంత్రం నాలుగు గంటలకు రథోత్సవాన్ని నిర్వహించనున్నారు. అందుకు ప్రభుత్వ యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. ఈ కార్యక్రమానికి తెలుగు రాష్ట్రాల నుంచి దాదాపు లక్ష మంది దాకా భక్తులు వస్తారని అంచనా వేశారు. ఆ మేరకు వారికి సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ ఆదేశాల మేరకు శాఖల అధికారులు ఏర్పాట్లు చేశారు. వాహనాల పార్కింగ్, తాగునీరు, విద్యుత్ సౌకర్యాలను కల్పించారు. మొబైల్ వైద్య సేవలతో పాటు తాత్కాలిక మరుగుదొడ్లు నిర్మించనున్నారు. అవాంఛనీయ ఘటనలు జరుగకుండా ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించనున్నారు. రథోత్సవానికి రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు.

ఉమామహేశ్వరంలో..
భక్తుల సందడి

- అశ్వవాహన సేవలో పార్వతీ పరమేశ్వరులు



అశ్వ వాహనంలో ఉత్సవమూర్తుల ఊరేగింపు

అచ్చంపేటఅర్బన్, జనవరి 17: ఉమామహేశ్వర క్షేత్రంలో బుధవారం భక్తులు స్వామివారి దర్శనానికి బారులు తీరారు. ఉమామహేశ్వరంలో స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి హైదరాబాద్, నల్గొండ, ఉమ్మడి మహబూబ్‌నగర్, దేవరకొండ తదితర ప్రాంతాల నుంచి శ్రీశైలం వెళ్లే భక్తులు ఉమామహేశ్వరుడ్ని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. కొంతమంది భక్తులు భోగమహేశ్వరం నుంచి మెట్ల మార్గం ద్వారా కొండపైకి చేరుకుని ఈశ్వరునికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ నెల 15వ తేదీ నుంచి ఉమామహేశ్వర క్షేత్రంలో బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తుండడంతో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో భక్తులు బారులు తీరారు. మంగళవారం ఉదయం స్వామివారిని అశ్వవాహన సేవలో ఊరేగింపుగా ఆలయం నుంచి పాపనాశిని గుండం వరకు తీసుకెళ్లి అక్కడ స్వామి వారికి గంగాజలంతో అభిషేకాలు నిర్వహించి అనంతరం ఆలయం గర్భగుడి వరకు వేదమంత్రాలు మంగళవాయిద్యాలతో ఊరేగింపుగా తీసుకొచ్చారు. అర్చకులు వీరయ్య, నీకంఠం, రాజశేఖర్‌శర్మ, చంద్రశేఖర్, శర్మ, ప్రవీణ్‌శర్మ, రవి కుమార్‌తో పాటు తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి ఆరుగురు అర్చకులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదే విధంగా సాయంత్రం 4 గంటలకు సాయమౌపాసన, సదస్యం, బలిహరణం, నీరాజనం, అశ్వవాహనసేవ, మంత్రపుష్పం, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ ఈవో శ్రీనివాసరావు, ఆలయ కమిటీ చైర్మన్ కందూరి సుధాకర్ అన్ని రకాల చర్యలు తీసుకున్నారు.



కోలాటం వేస్తున్న చిన్నారులు

ప్రజలు మెచ్చుకునేలా పని చేయాలి

- అధికారులతో సమీక్షలో మంత్రి జూపల్లి కృష్ణారావు



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

వనపర్తి రాజీవ్ చౌరస్తా, జనవరి 17: అధికారులు తమ శాఖల పని తీరును మెరుగుపరుచుకుని ప్రజలు మెచ్చుకునేలా పని చేయాలని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. గత ప్రభుత్వానికి, ప్రస్తుత ప్రభుత్వానికి మధ్య స్పష్టమైన వ్యత్యాసం కనిపించేలా అధికారులు విధులు నిర్వహించాలన్నారు. బుధవారం వనపర్తి జిల్లా సమీకృత కలెక్టరేట్ సముదాయంలో ప్రభుత్వ శాఖలపై మంత్రి కలెక్టరేట్ తేజస్ నందలాల్ పవార్, వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరితో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జూపల్లి మాట్లాడుతూ... తెలంగాణ ఉద్యమంలో అసువులు బాసిన ఉద్యమకారుల ఆకాంక్షలకు అనుగుణంగా పరిపాలన సాగాలన్నారు. ప్రభుత్వ ఆదాయానికి గండి పడకుండా, ప్రభుత్వ భూములు కబ్జా కాకుండా అధికారులు బాధ్యతలు తీసుకోవాలని సూచించారు. సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో పదేండ్లలో అనుకున్న ప్రగతి సాధించలేదన్నారు. అన్ని రంగాల్లో పురోగతి, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా గత ప్రభుత్వ పాలన జరగలేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వంలో ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు ప్రజా సేవకులం మాత్రమే అనే విషయాన్ని గుర్తించాలన్నారు. సమస్యలు విన్నవించుకోవడానికి వచ్చిన ప్రజలతో మర్యాదగా మసలుకోవాలని హితవు పలికారు. అంతిమంగా ప్రజల చేత శభాష్ అనిపించుకునేలా అధికారుల పనితీరు ఉండాలని ఆయన సూచించారు.

వేసవిలో తాగునీటి ఇక్కట్లు లేకుండా చూడాలి

మిషన్ భగీరథపై చర్చ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... వేసవిలో తాగునీటి ఇబ్బందులు లేకుండా ఇప్పటి నుంచే ప్రత్యేక ప్రణాళికలతో ముందుకు సాగాలన్నారు. అధికారులు ఇస్తున్న లెక్కలకు క్షేత్రస్థాయిలో ఉన్న లెక్కలకు పొంతన లేదని సరైన పర్యవేక్షణ లేకపోవడం వల్ల చాలా గ్రామాల్లో మిషన్ భగీరథ నీళ్లు రావడం లేదని తెలిపారు. మరో పది రోజుల్లో మరోసారి సమీక్ష నిర్వహిస్తామని, వాస్తవిక నివేదికలు తయారు చేసి ఇవ్వాలని అధికారులను ఆదేశించారు.

మైన్స్ ఆదాయంపై నివేదిక ఇవ్వాలి

రెవెన్యూ అంశాలపై చర్చ సందర్భంగా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ నివేదికను వినిపించారు. ధరణిలో ఇప్పటి వరకు 26,900 దరఖాస్తులు వచ్చాయని, ఇప్పటి వరకు 23వేల ఫైలులకు దరఖాస్తులు పరిష్కరించడం జరిగిందని తెలిపారు. మరో 3500 దరఖాస్తులు ఆయా కారణాల వల్ల పెండింగ్‌లో ఉన్నట్లు చెప్పారు. స్పందించిన మంత్రి జూపల్లి ఇప్పటి వరకు కబ్జా అయిన భూములను పరిరక్షించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. గనులు, భూగర్భశాఖకు సంబంధించి జిల్లాలో ఎన్ని మైన్స్‌లు ఉన్నాయి?, వాటికి సంబంధించిన ఖనిజాలు ఎక్కడ వినియోగించారు?, వచ్చిన ఆదాయం ఎంత?, ఎక్కడ వినియోగించారు అనే పూర్తి నివేదికను తయారు చేయాలన్నారు. ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో ప్రారంభమైన అన్ని రకాల పనులను తిరిగి ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం మారిందని, కొన్ని శాఖల్లో ఇంకా మాజీ ముఖ్యమంత్రి చిత్ర పటాలు ఉన్నాయని, వాటిని మార్చల్సిందిగా సూచించారు. మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి మాట్లాడుతూ జూరాల నుంచి కుడి కాలువ ద్వారా యధావిధిగా నీరు పారుతుందని, ఎడమ కాలువకు మాత్రం ఇబ్బందులు ఏర్పడ్డాయన్నారు. మక్తల్ నియోజకవర్గంలో ప్రస్తుత పంటకు కనీసం రెండు తడులకు సాగునీరు అందించేలా అధికారులను ఆదేశించాలని మంత్రిని కోరారు. అందుకు అధికారులు సానుకూలంగా స్పందించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు సంచిత్ గంగ్వార్, తిరుపతిరావు, అడిషనల్ ఎస్పీ తేజావత్ రాందాస్, ఆర్డీవో పద్మావతి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

చైర్‌పర్సన్ మార్పునకు ససేమిరా

- బెడిసికొట్టిన ఇద్దరు రియల్‌ఎస్టేట్ వ్యాపారుల ఎత్తుగడలు
- ఎన్నికల్లో మోసం చేసి పదవుల కోసం ముందుకొస్తారా అంటూ మాజీ ఎమ్మెల్యే సూటీ ప్రశ్నలు
- ముఖం చెల్లక వెనుదిరిగిన నాయకులు

నాగర్‌కర్నూల్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : మునిసిపల్ పాలక వర్గాన్ని మార్చాలని ఇద్దరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు వేసిన ఎత్తుగడలు బెడిసికొట్టాయి. ఇందుకు మాజీ ఎమ్మెల్యే తీవ్ర విముఖత వ్యక్తం చేయడంతో సదరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు ముఖం చెల్లక వెనుదిరిగారు. మూడు రోజుల క్రితం జరిగిన ఈ సంఘటన నాగర్‌కర్నూల్‌లో హాట్ టాపిక్‌గా మారింది. మునిసిపల్ పాలకవర్గం కాల పరిమితి మరో ఏడాదిలోపల మిగిలి ఉన్న నేపథ్యంలో చైర్‌పర్సన్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాలని వచ్చిన ప్రతిపాదనలు బీఆర్ఎస్ నుంచి చాలా మంది సభ్యులు కాంగ్రెస్‌లో చేరుతామని చేసిన అభ్యర్థనలను ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి పరిగణనలోకి తీసుకోలేదు. స్వల్ప వ్యవధిలోనే ఎన్నికలు రానున్న నేపథ్యంలో ప్రజా క్షేత్రంలో బలం తేల్చుకున్నాకే నాగర్‌కర్నూల్ మునిసిపాలిటీని కైవసం చేసుకోవాలని ఆయన కాంగ్రెస్ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. కాగా, జనరల్ లేడీకి కేటాయించిన నాగర్‌కర్నూల్ మునిసిపల్ చైర్‌పర్సన్ పదవి బీసీ సామాజిక వర్గానికి చెందిన కల్పనకు వరించింది. దాదాపు నాలు గేండ్లుగా ఆమె ఆ పదవిలో కొనసాగుతున్నారు. భర్త భాస్కర్‌గౌడ్ మర్రి జనార్దన్‌రెడ్డికి ప్రధాన అనుచరుడుగా ఉన్నారు. ఎన్నికల ప్రక్రియ ముగిసిన తర్వాత మర్రి జనార్దన్‌రెడ్డి ఓడిపోవడం రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన క్రమంలో నాలుగేళ్ల పదవీ కాలాన్ని పూర్తి చేసుకున్న కల్పనపై అవిశ్వాసం పెట్టనున్నారని వదంతులు వ్యాపించాయి. ఈ క్రమంలో బీఆర్ ఎస్‌కు చెందిన కౌన్సిలర్లు కాంగ్రెస్‌కు టచ్‌లోకి వెళ్లారు. మీరు ఎవరినీ ప్రతిపాదించినా మేము మద్దతిస్తామని పేర్కొనప్పటికీ దామోదర్‌రెడ్డి అందుకు అంగీకరించలేదు. మెజార్టీ సభ్యులున్న బీఆర్ఎస్ చైర్‌పర్సన్‌ను దొడ్డిదారిన దించి అప్రతిష్టను మూటగట్టుకోవాలనే తలంపు లేదని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో ఇద్దరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు కొత్త ప్రతిపాదనతో మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి వద్ద ప్రత్యక్షమయ్యారు.

చైర్‌పర్సన్ పదవిని అరెకటిక సామాజిక వర్గానికి చెందిన ఒకరికి వైస్ చైర్మన్ పదవిని కౌన్సిలర్‌గా వ్యవహరిస్తున్న ఒక రియల్ ఎస్టేట్ వ్యాపారికి అప్పజెప్పాలని ప్రతిపాదనలు మోసుకెళ్లగా, మర్రి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసినట్లు సమాచారం. పట్టణంలో కొందరు కౌన్సిలర్ల వ్యవహారం మూలంగానే తాను ఓటమి చెందానని ఆ వ్యవహారం నుంచి కోలుకోకముందే మీకు పదవులపై మోజు పుట్టిందా అని సూటిగా ప్రశ్నించినట్లు విశ్వసనీయ సమాచారం. బీఆర్ఎస్‌లోనే ఉంటూ వైరు పక్షానికి సమాచారం, సహకారం అందించిన అందరి వివరాలు తన వద్ద ఉన్నాయని మీకు అవసరమైతే చెప్పండి ఆధారాలతో సహా ఇప్పుడే చూపిస్తానంటూ బహిరంగంగా చెప్పడంతో ఎదురు మాట్లాడే ధైర్యం లేక కొందరు కౌన్సిలర్లు వెనక్కి తిరిగొచ్చారు.

● అవిశ్వాసానికి ఎందరు కావాలంటే...

ప్రస్తుత చైర్‌పర్సన్ కల్పనపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాలంటే కనీసం 18మంది నోటీసు ఇవ్వాల్సి ఉంది. ఇందులో మెజార్టీ సభ్యులు బీఆర్ఎస్‌కు చెందిన వాళ్లే ఉన్నారు. కాంగ్రెస్ నుంచి ఏడుగురు సభ్యులున్నప్పటికీ ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం పెట్టి తక్షణం ఆమెను దించే యోచన లేకపోవడంతో మెజార్టీ కౌన్సిలర్లు ముందుకు రాని పరిస్థితి ఏర్పడింది.

అయితే రాష్ట్రంలో అధికార మార్పిడి జరిగినందున ఎమ్మెల్సీగా కూచకుళ్ల దామోదర్‌రెడ్డి, ఎమ్మెల్యేగా ఆయన తనయుడు రాజేష్‌రెడ్డి ప్రాతినిథ్యం వహిస్తున్నందున వారి మాటే చెల్లుబాటు అయ్యే అవకాశం ఉన్న నేపథ్యంలో కాంగ్రెస్ ప్రస్తుత చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం తీర్మానం ప్రవేశపెట్టే యోచనలో లేదు.

పాలమూరు మార్కెట్‌లోకి

హ్యూందాయ్ కొత్త క్రెటాకారు



'హ్యూందాయ్ కొత్త క్రెటాకారు'ను మార్కెట్లోకి విడుదల చేస్తున్న జిల్లా రవాణా అధికారి ఎస్.నరేష్

పాలమూరు, జనవరి 17 : మహబూబ్‌నగర్ మార్కెట్లోకి "హ్యూందాయ్ కొత్త క్రెటా కారు"ను జిల్లా రవాణా అధికారి ఎస్.నరేష్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ట్రెండ్ హ్యూందాయ్ కారు షోరూంలో "హ్యూందాయ్ కొత్త క్రెటాకారు"ను షోరూం మేనేజింగ్ డైరెక్టర్ గట్టు గోపాల్‌రెడ్డి, డైరెక్టర్లు గట్టు సిరిచందన రెడ్డి, గట్టు హర్షిత్‌రెడ్డిలతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గట్టు గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ ఈ ఏడాది అమ్మకాల్లో 65శాతం ఎస్వీయూలే ఉంటాయని భావిస్తున్నామన్నారు. 2030 నాటికి మొత్తం విక్రయాల్లో విద్యుత్ కార్ల వాటా 20శాతం సాధించాలని కంపెనీ లక్ష్యంగా పెట్టుకుందన్నారు. కొత్త క్రెటా కారు ధర రూ.10.99-19-99లక్షలు (ఎక్స్ షోరూం)గా ఉందన్నారు. లెవెల్ 2 ఏడీఏఎస్ సేఫ్టీసూట్, 1.5లీటర్ టర్బోజీడీఐ ఇంజన్‌తో వస్తున్న కొత్త క్రెటా ఏడు వేరియంట్లలో అభించనుందని తెలిపారు. డీజిల్ వర్షన్‌లో 21 కిలోమీటర్, పెట్రోల్ 18 కిలోమీటర్ మైలేజ్ వస్తుందన్నారు. 360 డిగ్రీ కెమెరా, 10.25 ఇంచెస్ టచ్‌స్క్రీన్, బోస్ సౌండ్ సిస్టమ్ కలిగి ఉందన్నారు. కార్యక్రమంలో కంపెనీ మేనేజర్ శివకుమార్, షోరూం సేల్స్ మేనేజర్ హర్షవర్ధన్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఉరి వేసుకొని యువకుడి ఆత్మహత్య

జడ్చర్ల, జనవరి 17 : చెట్టుకు ఉరి వేసుకొని యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలంలోని పెద్దఆదిరాలలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ చంద్రమోహన్ కథనం మేరకు.. మిడ్జిల్ మండలంలోని మసిగుండ్లపల్లి గ్రామానికి చెందిన తిరుపతయ్య (33) అతని కూతురు జన్మదినం ఈ నెల 12న ఉందని అత్తగారి ఉరు అయిన కేశంపేట్ మండలం దత్తాయపల్లికి వెళ్లాడు. అక్కడ ఆయన కూతురి జన్మదినం వేడుకలు అయ్యాయి. మరుసటి రోజు 13న ఆయన స్వగ్రామానికి వెళుతున్నానని భార్యకు చెప్పి బయలుదేరాడు. అప్పటి నుంచి తిరుపతయ్య కనపడకుండాపోవడంతో కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ లభించలేదు. బుధవారం పెద్దఆదిరాలలోని రాఘవులు అనే వ్యక్తికి చెందిన పొలంలో చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు కనిపించాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చెరుకొని మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం జడ్చర్ల ఆసుపత్రికి తరలించారు. తమ్ముడు అంజనేయులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆదాయ వనరుల సమీకరణపై దృష్టి పెట్టండి

» అధికారులకు డిప్యూటీ సీఎం భట్టి దిశానిర్దేశం



హైదరాబాద్, జనవరి 17(ఆంధ్రజ్యోతి): అదనపు ఆదాయ వనరుల సమీకరణపై దృష్టి సారించాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులకు సూచించారు. సచివాలయంలో ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుతో కలిసి బుధవారం వివిధ శాఖల అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. పరిశ్రమలు, గనులు, గృహ నిర్మాణం, హెచ్‌ఎండీఏ, టీఎస్ఐఐసీ విభాగాల ఉన్నతాధికారులు సమీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా శాఖల వారీగా పెండింగ్ బకాయిలపై చర్చించారు. హెచ్ఎండీఏ పరిధిలో ఇప్పటి వరకు విక్రయించిన భూములు, వచ్చిన ఆదాయం, పెండింగ్ బకాయిల మీద సమగ్ర సమీక్ష చేశారు. ప్రభుత్వానికి రావాల్సిన ప్రతిపైసా వదలొద్దని అధికారులకు సూచించారు. పారిశ్రామిక పార్కులను వినియోగంలోకి తీసుకురావాలన్నారు. తూప్రాన్‌లో పరిశ్రమల కోసం 325 ఎకరాలు ప్రభుత్వం కేటాయించగా ఇప్పటి వరకు 139 ఎకరాలే సేకరించారని, మిగిలిన భూమిని సత్వరమే సేకరించాలని ఆయన ఆదేశించారు. పరిశ్రమల శాఖ పరిధిలో జాయింట్ వెంచర్ల నుంచి ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయ వనరులపై ఆరా తీశారు. హౌసింగ్ బోర్డు ఆధ్వర్యంలో 12 జాయింట్ వెంచర్ ప్రాజెక్టులల్లో ఆరు ప్రాజెక్టులు పూర్తయ్యాయని, వాటి నుంచి రూ.955 కోట్లు ప్రభుత్వానికి రావాల్సి ఉండగా రూ.430 కోట్లు వచ్చాయని అధికారులు తెలిపారు. రూ.525 కోట్ల బకాయిలు రాబట్టుకునేందుకు తీసుకుంటున్న చర్యలను అధికారులు ఉప ముఖ్యమంత్రికి వివరించారు. అలాగే మైనింగ్ శాఖలో రావాల్సిన ఆదాయంపై భట్టి, అధికారులను అడిగి తెలుసుకున్నారు.

ఏడాదికి రూ.40 వేల కోట్లు వడ్డీ కట్టాలి

» రాష్ట్ర ఆబ్కారీ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జూపల్లి కృష్ణారావు

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, జనవరి 17 : గత ప్రభుత్వం చేసిన అప్పులకు ఏడాదికి సుమారు రూ. 40 వేల కోట్లు వడ్డీ కట్టాల్సిన పరిస్థితి ఉందని రాష్ట్ర ఆబ్కారీ, సాంస్కృతిక, పర్యాటక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. బుధవారం ఆయన వనపర్తిలోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలో స్థానిక ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, జిల్లా అధికారులతో ప్రభుత్వ శాఖలపై సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. గత శాసనసభ సమావేశంలో చర్చ సందర్భంగా తెలంగాణ రాష్ట్రానికి రూ. 7 లక్షల కోట్లు అప్పు ఉన్నట్లు తేలిందన్నారు. గత పాలకులు రూ. 2 లక్షల కోట్లు ఉన్నట్లు బుకాయిస్తున్నారని అన్నారు. గత పదేళ్లు అధికారంలో ఉండి ఇప్పుడు గొప్ప గొప్ప మాటలు మాట్లాడుతున్నారని ఆయన విమర్శించారు. వాస్తవం ఒకటుంటే వారు మరొకటి చెబుతున్నారని అన్నారు. ఇలాంటి ఆర్థిక పరిస్థితుల్లో కూడా తమ ప్రభుత్వం ఇచ్చిన హామీలు, ఆరు గ్యారెంటీలను అమలు చేస్తుందని చెప్పారు. ప్రభుత్వ ఆస్తులు ఎక్కడెక్కడ కబ్జాకు గురయ్యాయో, ప్రభుత్వ ఆదాయానికి ఎక్కడైతే గండిపడిందో రిపోర్టుల ఆధారంగా చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు లక్ష్యం, అమరవీరుల ఆశయాలు గత ప్రభుత్వ హయాంలో నెరవేరలేదన్నారు. అధికారులు పౌరుల పట్ల మర్యాదగా మసులుకోవాలని వారి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రజలకు పాలకులుకాదని సేవకులు మాత్రమేనని ఆయన స్పష్టం చేశారు. అధికారులు సమీక్ష సమావేశం సందర్భంగా ఇచ్చే రిపోర్టులు వాస్తవికతతో కూడిఉండాలని సూచించారు. గ తానికి , ప్రస్తుతానికి, భవిష్యత్‌కు స్పష్టమైన భేదం ఉండేలా పనితీరు ఉంటుందన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా, పూర్తి పారదర్శకంగా తమ పరిపాలన సాగుతుందని ఆయన చెప్పారు.

బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే షకీల్‌పై ఎఫ్ఐఆర్

పంజాగుట్ట, జనవరి17 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ నేత, బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్‌పై ఎఫ్ఐఆర్ నమోదైంది. డిసెంబరు 23న ప్రజాభవన్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదం కేసులో పంజాగుట్ట పోలీసులు షకీల్ పేరును ఎఫ్ఐఆర్, నిందితుల రిమాండ్ రిపోర్టులో చేర్చారు. ప్రమాదానికి కారణమైన షకీల్ కుమారుడు సాహిల్ అలియాస్ రాహిల్ దుబాయ్ పారిపోయేందుకు షకీల్ సహకరించారని పోలీసుల అభియోగం. సాహిల్ దుబాయ్ పారిపోయేందుకు మొత్తం పది మంది సాయపడ్డారని పోలీసులు అనుమానిస్తున్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే ముగ్గురిని అరెస్టు చేసిన పోలీసులు రిమాండ్‌కు తరలించారు. అరెస్ట్ అయిన వారిలో షకీల్ ఇంట్లో పని చేసే అర్బాజ్(25), కారు డ్రైవర్ సొహైల్(26) ఉన్నారు. ఇక, మాజీ ఎమ్మెల్యే షకీల్, జకీయా, షాహిద్‌పై ఇప్పటికే లుకౌట్ నోటీసులు జారీ చేసిన పోలీసులు ఖలీల్, షర్ఫుద్దీన్, అస్లాం అనే వ్యక్తుల కోసం గాలిస్తున్నారు.

పారదర్శకంగా మెడికల్ బోర్డు ఫిట్‌నెస్ పరీక్ష

» మోసగాళ్లను నమ్మకండి: సింగరేణి సీఎండీ

హైదరాబాద్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): అనారోగ్య కారణాలతో డ్యూటీలు చేయలేని సింగరేణి ఉద్యోగుల కోసం మెడికల్ బోర్డు చేపట్టే ఫిట్‌నెస్ పరీక్ష అత్యంత పారదర్శకంగా, బాధ్యతాయుతంగా, అక్రమాలకు తావు లేకుండా నిర్వహిస్తున్నామని ఆ సంస్థ సీఎండీ ఎన్.బలరామ్ ఒక ప్రకటనలో తెలిపారు. మెడికల్ బోర్డులో నిపుణులైన వైద్యులు పరీక్షించి, నిబంధనల ప్రకారం అనారోగ్యులైన ఉద్యోగులను అన్ ఫిట్ చేస్తారని అన్నారు. వారి స్థానంలో కారుణ్య నియామకాలను వెంటనే చేపడుతున్నామని తెలిపారు. అన్ ఫిట్ చేయిస్తామనే మోసగాళ్ల మాటలను ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మొద్దని.. అలాంటి వారి పట్ల అత్యంత అప్రమత్తంగా ఉండాలని కార్మికులకు సూచించారు.

బీజేపీ సర్కార్ వైఫల్యాలపై 'యంగ్ ఇండియా కీ బోల్'

» వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించిన రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు

హైదరాబాద్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో బీజేపీ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ కాంగ్రెస్ పార్టీ విధానాలపై ప్రజలకు అవగాహన పెంచేందుకు యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో 'యంగ్ ఇండియా కీ బోల్ సీజన్-4'ను ప్రారంభిస్తున్నటు యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు శివసేన రెడ్డి తెలిపారు. గాంధీభవన్‌లో బుధవారం శివసేన రెడ్డి యూత్ కాంగ్రెస్ నాయకులతో కలిసి 'యంగ్ ఇండియా కీ బోల్-సీజన్-4' వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాలుగేళ్లుగా యంగ్ ఇండియా కీ బోల్ కార్యక్రమాన్ని యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు వివరించారు.

రాష్ట్రానికి ఆరుగురు ఐపీఎస్‌ల కేటాయింపు

» ఇందులో ఇద్దరు తెలంగాణవారే

హైదరాబాద్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ఆరుగురు కొత్త ఐపీఎస్(ఇండియన్ పోలీస్ సర్వీస్) అధికారులను కేటాయించింది. 2022 బ్యాచ్‌కు చెందిన ఈ అధికారులను తెలంగాణ కేడర్‌కు కేటాయిస్తున్నట్లు కేంద్ర హోంశాఖ అండర్ సెక్రటరీ అంజన్ సర్కార్.. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి తెలియజేశారు. దేశవ్యాప్తంగా మొత్తం 200 మంది ఐపీఎస్ అధికారులను వివిధ రాష్ట్రాలకు కేటాయించారు. ఇందులో తెలంగాణకు కేటాయించిన ఆరుగురు ఐపీఎస్‌లలో ఇద్దరు తెలంగాణ రాష్ట్రానికి చెందినవారు కాగా.. మిగతా నలుగురు ఇతర రాష్ట్రాలకు చెందినవారున్నారు. జనరల్ కేటగిరీ కింద అయేషా ఫాతిమా(సొంత రాష్ట్రం మధ్యప్రదేశ్), మంధారె సోహమ్ సునీల్(మహారాష్ట్ర), మనన్ భట్(జమ్మూకశ్మీర్), ఓబీసీ కేటగిరీ కింద పత్తిపాక సాయికిరణ్(తెలంగాణ), రాహుల్ కాంత్(జార్ఖండ్), రిత్విక్ సాయి కొట్టె(తెలంగాణ)లను రాష్ట్రానికి కేటాయించారు. కాగా.. తెలంగాణకు చెందిన అనుగు శివ మారుతిరెడ్డిని ఒడిసాకు, రావుల జయసింహారెడ్డిని వెస్ట్ బెంగాల్‌కు, ఎస్.దీప్తి చౌహాన్‌ను ఉత్తరప్రదేశ్‌కు కేటాయించారు.

భూకబ్జాదారులు 3 నెలల్లో జైలుకే

రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి స్పష్టీకరణ

నల్లగొండ, జనవరి 17 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): భూ కబ్జాలు చేసిన వారిని రెండు మూడు నెలల్లో జైలుకు పంపుతామని రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని ఖాజాగూడ పెద్దచెరువు ఆక్రమణపై 'కూల్‌గా కబ్జా' శీర్షికన 'ఆంధ్రజ్యోతి' ప్రధాన సంచికలో ప్రచురితమైన కథనంపై మంత్రి స్పందించారు. బుధవారం నల్లగొండ జిల్లా కేంద్రంలో జరిగిన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన, ఆర్డీవో కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ 'కూల్‌గా కబ్జా' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనాన్ని చూపించి, అభినందించారు. హైదరాబాద్‌లోని ఖాజాగూడ పెద్దచెరువు ప్రభుత్వ భూముల్లో కొండలను తవ్వి విల్లాలకు రోడ్డు నిర్మిస్తున్న తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే రోడ్డు నిర్మాణ పనులు ఆపించాలని, బాధ్యులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. భూపరిపాలన ప్రధాన కమిషనర్ నవీన్ మిత్తల్‌కు ఫోన్‌లో ఆదేశాలు జారీ చేశారు. బుధవారం సాయంత్రంలోగా నిర్మాణాలు ఆపి అది ప్రభుత్వ స్థలమని సూచించే బోర్డు, ప్రహరీ ఏర్పాటు చేయిస్తామన్నారు. గత ప్రభుత్వంలో పనిచేసిన కీలక మంత్రి బావమరిది ప్రభుత్వ భూమిని పట్టపగలు కబ్జా చేశారని, పదేళ్లుగా గత ప్రభుత్వంలో లక్షల కోట్ల విలువైన భూములు అన్యాక్రాంతమయ్యాయన్నారు. 'ధరణి' పేరిట కబ్జా చేసి దోచుకున్న వారి వివరాలు త్వరలో బయటపెడతామని, భూకబ్జా చేసినవారు ఎంతటివారైనా వదిలే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా కబ్జాకు గురైన భూములు కాపాడేలా అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లోపే చర్యలు తీసుకుంటామన్నారు.



ఖాజాగూడ కబ్జాపై చర్యలు తీసుకోవాలని నవీన్ మిత్తల్‌ను ఫోన్‌లో ఆదేశిస్తున్న మంత్రి కోమటిరెడ్డి

120 మాసాలు అధికారంలో ఉండి నెల రోజులకే కొంపమునిగినట్టు మాజీ మంత్రి కేటీఆర్ మాట్లాడుతున్నారని విమర్శించారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో వెయ్యి కోట్ల విలువైన 400 ఎకరాల కాందిశీకుల భూమిని గత మంత్రి, ఎమ్మెల్యేలు కబ్జా చేయకుండా అడ్డుకున్నానని తెలిపారు.

కబ్జాపై కదిలారు

(మొదటిపేజీ తరువాయి)

వెంటనే స్పందించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి ఉదయం 10 గంటలకల్లా ప్రాథమిక నివేదిక అందజేయాలని ఆదేశించారు. నల్లగొండలో జరిగిన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న మంత్రి.. హైదరాబాద్‌లోని రెవెన్యూ ఉన్నతాధికారుల నుంచి ప్రాథమిక నివేదిక అందిన అనంతరం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనం కబ్జా బాగోతాన్ని వెలుగులోకి తీసుకొచ్చినట్లు రూఢీ చేసుకున్నారు. నిర్మాణదారులు, అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్కడ నుంచే ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

ప్రభుత్వ యంత్రాంగం పరిశీలన

'ఆంధ్రజ్యోతి' కథనంపై మంత్రి ఆదేశాల నేపథ్యంలో ప్రభుత్వ యంత్రాంగం కదిలింది. ఖాజాగూడ పెద్ద చెరువును అనుకొని నిర్మాణం జరుగుతున్న రోడ్డు పనులను, ఆ ప్రాంతాన్ని బుధవారం రాజేంద్రనగర్ ఆర్డీఓ మల్లయ్యతో పాటు ఇరిగేషన్ ఏఈ నాగరాజు, జీహెచ్ఎంసీ సర్కిల్-20 డిప్యూటీ కమిషనర్ రంజీత్, హైదరాబాద్ మెట్రో అధికారులు సందర్శించారు. దర్జాగా ఘాట్ రోడ్డు తరహాలో సాగుతున్న నిర్మాణ పనులను పరిశీలించారు. మంగళవారం రాత్రి వరకు బుల్డోజర్లు, ట్రాక్టర్లు, టిప్పర్లతో పనులు జరగ్గా, బుధవారం ఉదయానికి పనులు ఆగిపోయాయి. అక్కడ బుల్డోజర్లు, ట్రాక్టర్లు, టిప్పర్లు ఏవీ లేవు. చెరువు నుంచి కొండపైకి వేసే రోడ్డులో ముందు భాగంలో ఔట్‌పోస్టు వద్ద సెక్యూరిటీ సిబ్బంది కూడా లేరు. అక్కడి కొండలు, గుట్టలను తవ్విన తీరును పరిశీలించారు. అనంతరం ఆర్డీఓ మల్లయ్య మాట్లాడుతూ ఈ ప్రాంతంలోని రాయదుర్గం పాయ్‌గా సర్వే నెంబర్ 66/1లో 7 ఎకరాలు, 66/2లో 1.20 ఎకరాలు మొత్తం 8.20 ఎకరాల భూమిని ప్రభుత్వ ఆదేశాల మేరకు హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్‌కు గతేడాది సెప్టెంబరులో పంచనామా చేసి అప్పగించినట్లు తెలిపారు. చెరువు నుంచి గుట్టపైకి రోడ్డు నిర్మాణం ఏ ప్రభుత్వ విభాగం చేపట్టడం లేదని, అక్రమంగా రోడ్డు నిర్మాణం చేస్తున్నారని తెలిపారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. అయితే 'ఆంధ్రజ్యోతి'కి కూడా రంగారెడ్డి డీపీఆర్ఓ ద్వారా ఆర్డీఓ లేఖను అందజేశారు. అందులోని వివరాల ప్రకారం.. రాయదుర్గం పాన్‌మక్తాలో సర్వే నెంబర్ 66లో 2009-10 పహణీ ప్రకారం 109.32 ఎకరాల భూమి 'పోరంబోకు' కింద ఉండగా వివిధ సంస్థలకు ప్రభుత్వం కేటాయింపులు చేసిందని పేర్కొన్నారు. హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్‌కు పంచనామా చేసి అప్పగించిన 8.2 ఎకరాల స్థలంలో కొందరు గుర్తు తెలియని వ్యక్తులు రోడ్డు నిర్మించడాన్ని గుర్తించినట్లు వివరించారు. అక్రమంగా రోడ్డేసిన వారిపై క్రిమినల్ కేసుల నమోదుకు ఫిర్యాదు చేశామని, మెట్రో, ఇరిగేషన్ అధికారులు ప్రభుత్వ భూమి అంటూ బోర్డులు ఏర్పాటు చేశారని తెలిపారు.





రోడ్డు వేస్తున్న చోట ప్రభుత్వ భూమి అంటూ ఏర్పాటు చేసిన బోర్డు; నిర్మాణ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అధికారులు

కబ్జా బాధ్యులను కప్పిపుచ్చేందుకు తిప్పలు

శేరిలింగంపల్లి మండలంలో కొన్నాళ్లుగా యథేచ్ఛగా సాగుతున్న కబ్జాలపై అధికార యంత్రాంగం తీరు ఆది నుంచి విస్మయానికి గురి చేస్తోంది. తాజాగా ఓ వైపు 'ఆంధ్రజ్యోతి'లో కథనం.. ఆ వెంటనే మంత్రి ఆదేశాలతోనే ప్రభుత్వ యంత్రాంగం కదిలిందే తప్ప అంతకు ముందు విషయం తెలిసినా రెవెన్యూ, జీహెచ్ఎంసీ యంత్రాంగం ఆ వైపు కన్నెత్తి చూడలేదు. ప్రభుత్వ భూమిలో కొండలను తొలుస్తూ రోడ్డేస్తున్న వైనాన్ని 'ఆంధ్రజ్యోతి' వారం రోజుల ముందే రెవెన్యూ, జీహెచ్ఎంసీ, ఇరిగేషన్, హెచ్ఆర్డీసీఎల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి వివరణ కోరింది. ఆ సందర్భంలో తమకు తెలియదని, తాము ఎలాంటి అనుమతివ్వలేదంటూ అధికారులు చెప్పుకొచ్చారు తప్ప ఎలాంటి చర్యలకూ ఉపక్రమించలేదు. 'ఆంధ్రజ్యోతి'లో కథనం వచ్చిన తర్వాతే రెవెన్యూ, జీహెచ్ఎంసీ, ఇరిగేషన్ అధికారులు హడావుడి చేశారు. కబ్జా ప్రాంతాన్ని పరిశీలించి అక్కడ ప్రభుత్వ భూమి అంటూ బోర్డులు ఏర్పాటు చేశారు. కబ్జా బాధ్యులను అధికారులెవ్వరూ గుర్తించలేదు. ఆ ప్రాంతాన్ని పరిశీలించిన అధికారులు ఎక్కడి నుంచి ఎక్కడి వరకు తవ్వకాలు జరిపారనే దాన్ని పరిశీలించారు. తవ్వకాల ఆధారంగా ఏ నిర్మాణ సంస్థ పనులు చేపట్టిందో గుర్తించడం సులువు. కానీ అదేమీ చేయలేదు. పరిసర ప్రాంతాల వారిని అధికారులు కనీసం ఆరా తీయలేదు. కబ్జా బాధ్యులను కప్పిపుచ్చే విధంగా అధికారుల తీరు ఉందని స్థానికంగా ఆరోపణలు వినిపిస్తున్నాయి.

రోడ్డేసేది 'గుర్తు తెలియని' వ్యక్తులట!

ఖాజాగూడ పెద్దచెరువును అనుకొని కొండలు గుట్టలను తొలుస్తూ రోడ్డేయ్యడంపై శేరిలింగంపల్లి ఆర్ఐ బుధవారం సాయంత్రం రాయదుర్గం ఇన్‌స్పెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు కాపీని అందజేయడానికి రెవెన్యూ అధికారులు ఆసక్తి చూపలేదు. రాయదుర్గం ఎస్ఐ శ్రీనివాస్ వివరాల ప్రకారం.. రాయదుర్గం పాన్ మక్తా సర్వే నెంబర్ 66/1లో ఏడు ఎకరాల ప్రభుత్వ భూమిలో కొందరు గుర్తు తెలియని వ్యక్తులు కబ్జా చేసి రోడ్డేస్తున్నారంటూ శేరిలింగంపల్లి మండల అదనపు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాంబాబు ఫిర్యాదు చేశారని, దాంతో కబ్జా చేయడం, పబ్లిక్ ఆస్తులను ధ్వంసం చేయడం లాంటి అంశాల ఆధారంగా 447, 427 సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. రెవెన్యూ అధికారులు చేసిన ఫిర్యాదులో ప్రభుత్వ భూమిని కొందరు గుర్తు తెలియని వ్యక్తులు కబ్జా చేసి రోడ్డేస్తున్నారంటూ పేర్కొనడం గమనార్హం. చెరువు పక్కనే ఔట్‌పోస్టు ఏర్పాటు చేసి మరీ యథేచ్ఛగా ఘాట్ రోడ్డు తరహాలో పనులు సాగించగా.. కూలీలు గుర్తు తెలియనివారు అయినా.. పనులు చేయించిన సంస్థ గుర్తు తెలియనిది ఎలా అవుతుందని పలువురు ప్రశ్నిస్తున్నారు. కొండలు, గుట్టలను తొలిచేసి అక్రమంగా రోడ్డేస్తున్నవారు స్థానికంగా అధికార యంత్రాంగానికి తెలిసినప్పటికీ తెలియదన్నట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీని వెనుక మాజీ మంత్రి బామ్మర్ది ప్రమేయం ఉండడంతో వారి పేర్లను చేరిస్తే భవిష్యత్తులో ఇబ్బందులు పడతామని జంకుతున్నట్లు తెలిసింది. అందుకే నిర్మాణ సంస్థ పేరు కానీ, కీలక వ్యక్తుల పేర్లు చేర్చలేదని తెలుస్తోంది. పోలీసులకు ఫిర్యాదు చేస్తే విచారణలో వారే బయటపెడతారని భావించినట్లు సమాచారం. ఆది నుంచి రెవెన్యూ అధికారుల తీరు తమ చేతులకు మట్టి అంటకుండా తప్పించుకుంటున్నట్లు ఉండడం గమనార్హం.

చడీచప్పుడు లేని మెట్రో అధికారులు

బయో డైవర్సిటీ సర్కిల్ పక్కనే దాదాపుగా రూ.1,200 కోట్లకు పైగా విలువైన 8.20 ఎకరాల ప్రభుత్వ భూమిని మెట్రో అధికారులకు అప్పగిస్తే వారు కనీసం ఆ వైపు తొంగి చూడలేదు. తమ భూమి అంటూ ఇప్పటి వరకు ఎలాంటి బోర్డు కూడా అక్కడ పాతలేదు. 'కూల్‌గా కబ్జా' కథనం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారి మంత్రితో పాటు ఉన్నతాధికారులు స్పందించారు. కానీ సరిగ్గా నాలుగు నెలల క్రితం ఐటీ కారిడార్‌లో గజం రూ.3 లక్షలకు పైగా ధర పలికే ప్రాంతంలో 8.20 ఎకరాల ప్రభుత్వ భూమిని పొందిన హెచ్ఎంఆర్ఎల్ ఉన్నతాధికారులు చడీచప్పుడు లేకుండా ఉన్నారు. ఒకరిద్దరు అధికారులను రెవెన్యూ అధికారులకు తోడుగా పంపి చేతులు దులుపుకున్నారు. పంచనామా చేసి హెచ్ఎంఆర్ఎల్ అధికారులకు అప్పగించామని రెవెన్యూ అధికారులు చెబుతున్నా నాటి రంగారెడ్డి కలెక్టర్ నుంచి తమకు ఎలాంటి ఆదేశాలు అందలేదని అధికారుల్లోనే చర్చ నడుస్తోంది. తమకు సంబంధం లేదని రెవెన్యూ, తమకు ఆదేశాలు అందలేదని హెచ్ఎంఆర్ఎల్ దోబుచులాడుతుండగా మధ్యలో సందట్లో సడేమియాలా ప్రముఖ నిర్మాణ సంస్థ దర్జాగా రోడ్డేసుకోవడం విశేషం.

నామినేటెడ్ పదవుల్లో ఆదివాసీలకు ప్రాధాన్యం కల్పించాలి

» ఆదివాసీ కాంగ్రెస్ రాష్ట్ర కార్యవర్గం డిమాండ్

» సమావేశంలో పాల్గొన్న దీపాదాస్ మున్షీ, బెల్లయ్యనాయక్, జగ్గారెడ్డి

హైదరాబాద్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి కృషి చేసిన ఆదివాసీ కాంగ్రెస్ నాయకులకు వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్ల పదవులనియామకంలో ప్రాధాన్యం కల్పించాలని తెలంగాణ ఆదివాసీ కాంగ్రెస్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం డిమాండ్ చేసింది. అసెంబ్లీ ఎన్నికల ముందు ఎస్సీ, ఎస్టీలకు ఇచ్చిన హామీ మేరకు ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ అమలు చేయాలని సమావేశం తీర్మానం చేసింది. బుధవారం గాంధీభవన్‌లో ఆదివాసీ కాంగ్రెస్ చైర్మన్ బెల్లయ్య నాయక్ అధ్యక్షతన జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర పార్టీ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఏఐసీసీ కార్యదర్శి రోహిత్ చౌదరి, కేంద్ర మాజీ మంత్రి పోరిక బలరాం నాయక్, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్ తదితరులు కూడా ఇందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా దీపాదాస్ మున్షీ మాట్లాడుతూ.. తెలంగాణలో పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి కృషి చేసిన ఆదివాసీ కాంగ్రెస్ మండల, జిల్లా, రాష్ట్రస్థాయి నాయకులను, కార్యకర్తలను అభినందించారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో గిరిజన విభాగం కాంగ్రెస్ గెలుపు కోసం గ్రామస్థాయిలో కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని అన్ని లోక్‌సభ స్థానాలను కాంగ్రెస్ కైవసం చేసుకునేలా పాటుపడాలని నాయకులకు కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో న్యాయ యాత్ర లక్ష్యాలను ప్రతి గిరిజన కుటుంబానికి చేరవేయాలని ఆమె సూచించారు.



ఆదివాసీ కాంగ్రెస్ సమావేశంలో పాల్గొన్న దీపాదాస్ మున్షీ, రోహిత్, బెల్లయ్య నాయక్, జగ్గారెడ్డి తదితరులు

అభివృద్ధికోసం తండ్లాడి.. ఎన్నికల్లో తడబడ్డాం!

(మొదటిపేజీ తరువాయి)



స్థానం అధికారం నుంచి ప్రతిపక్షానికి మారింది. దీనికి అధైర్య పడాల్సిన అవసరం లేదు. ఓటమి నుంచి తేరుకుని నెలరోజులకే సమీక్ష సమావేశాలను ప్రారంభించాం. ఇది పదకొండో పార్లమెంటరీ స్థాయి సమావేశం. కార్యకర్తల నుంచి విలువైన సూచనలు వచ్చాయి. కార్యకర్తలు కోరుకుంటున్న ప్రకారమే ఇకపై పార్టీ పనిచేస్తుంది. మోసపూరిత హామీలతో గెలిచిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. వాటిని అమలు చేయమని అడిగితే.. కాకమ్మ కథలు చెబుతోంది" అని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ వరుసగా పదేళ్ల పాలన సాగించడం అరుదని, ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకుని ఐదేళ్లలోపే ఇంటికి పోయిన కాంగ్రెస్ ప్రభుత్వాలే ఈ దేశంలో ఎక్కువగా ఉన్నాయన్నారు. అరచేతిలో వైకుంఠం చూపేలా కాంగ్రెస్ మ్యానిఫెస్టోను ప్రజల్లోకి తెచ్చిందని, హామీల అమలు గడువు ప్రకారం వంద రోజులు కాలేదని ఆగామని, లేకుంటే.. కాంగ్రెస్ సర్కారును చీల్చి, చెండాడే వారిమన్నారు. కర్ణాటకలో ఐదు గ్యారెంటీలకు నిధుల్లేవని ఆ రాష్ట్ర సలహాదారు చెబుతున్నారని, ఇక్కడ కూడా కాంగ్రెస్ నేతలు చావుకబురు చల్లగా చెప్పే రోజులు ఎంతో దూరంలో లేవని జోస్యం చెప్పారు. "ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దావోస్‌కు వెళ్లడమంటే ఖర్చు దండగ అన్నారు. ఇప్పుడేమంటారు? సీఎం బృందం దావోస్‌కు వెళ్లింది. ప్రశాంతంగా ఉన్న రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ హత్యారాజకీయాలు మొదలు పెడుతోంది" అని హరీశ్ మండిపడ్డారు. బీజేపీ ఎంపీ బండి సంజయ్‌పైనా హరీశ్‌రావు ఫైర్ అయ్యారు. "కాంగ్రెస్ ఎమ్మెల్యేలను కేసీఆర్ కొంటారని బండి సంజయ్ చెబుతున్నారు. చాలా రాష్ట్రాల్లో కాంగ్రెస్ ప్రభుత్వాలను కూల్చిన, పలు ప్రాంతీయ పార్టీలను చీల్చిన చరిత్ర బీజేపీదే. ఆ విషయాన్ని ఆయన తెలుసుకోవాలి" అని సూచించారు.

కార్యకర్తలను పట్టించుకోకపోవడం వల్లే..

అధికారంలో ఉన్నన్ని రోజులు పార్టీ కార్యకర్తలను, ముఖ్య నాయకులు పట్టించుకోలేదని, క్షేత్రస్థాయిలో పరిస్థితులను తెలుసు కునేందుకు ఎలాంటి ప్రయత్నం చేయలేదని నాగర్‌కర్నూల్ లోక్‌సభ స్థానం పరిధిలోని పలు అసెంబ్లీ సెగ్మెంట్లకు చెందిన బీఆర్ఎస్ నాయకులు, ముఖ్య కార్యకర్తలు ఈ సమావేశంలో అభిప్రాయపడ్డారని తెలిసింది. పక్క పార్టీల వల్ల కాకుండా.. సొంత పార్టీ నేతలే ముంచారని ఆరోపించినట్లు సమాచారం. పార్టీ ఓటమికి కారణాలు చెబుతూ.. అధిష్ఠానం తీరుపైనా పలువురు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. "అసంతృప్తి మొదలైనప్పుడే బుజ్జగించి ఉంటే పరిస్థితి వేరేలా ఉండేది. జూపల్లి కృష్ణారావు లాంటి వారు పార్టీని వీడడం వల్ల నష్టం వాటిల్లింది" అని వారు అభిప్రాయపడ్డట్లు తెలిసింది.

రాష్ట్రం పరువు తీసేలా రేవంత్ వ్యాఖ్యలు

దావోస్ పర్యటనలో ఉన్న సీఎం రేవంతర్ తెలంగాణ గురించి చేస్తున్న వ్యాఖ్యలు రాష్ట్రం పరువు తీసేలా ఉన్నాయని బీఆర్ఎస్ నేతలు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, విజయుడు, జైపాల్‌యాదవ్ ఆరోపించారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడారు. విదేశీ పర్యటనల్లో సీఎం అసంబద్ధ వ్యాఖ్యలు చేయడం తగదని, ఇటువంటి పరిస్థితులు ఇకపై రాకుండా చూసుకోవాలని హెచ్చరించారు.

కేసీఆర్ నడుస్తున్నారు...!

'ఎక్స్'లో వీడియో పోస్టు చేసిన ఎంపీ సంతోష్

హైదరాబాద్, జనవరి17(ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికలు ముంచుకొస్తున్న తరుణంలో బీఆర్ఎస్ శ్రేణులకు ఎంపీ సంతోష్ కుమార్ శుభవార్త చెప్పారు. శస్త్ర చికిత్స అనంతరం మాజీ సీఎం కేసీఆర్ క్రమంగా కోలుకుంటున్నారని, చేతికర్ర సాయంతో నెమ్మదిగా అడుగులు వేస్తున్నారని తెలిపారు. స్వగృహంలో కేసీఆర్ నడుస్తున్న వీడియోను సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేసిన ఆయన, ప్రతి అడుగు దృఢ సంకల్పంతో వేస్తున్నారని తన ఎక్స్ వేదికలో పేర్కొన్నారు.

డీఎస్సీకి అనుబంధ నోటిఫికేషన్!


(మొదటిపేజీ తరువాయి)

డీఎస్సీ నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. కాగా, గత ప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషన్‌తో టీచర్ పోస్టుల కోసం రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 1,77,502 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఆ పోస్టులకు సంబంధించి గత ఏడాది నవంబరు 20 నుంచి 30వ తేదీ వరకు పరీక్షలు నిర్వహించాల్సి ఉంది. అయితే అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ రావడంతో పరీక్షలను వాయిదా వేశారు. వాటిని మళ్లీ ఎప్పుడు నిర్వహించే అంశాన్ని ప్రకటించలేదు. ఆ తరువాత ప్రభుత్వం మారిపోగా.. కొత్త ప్రభుత్వం మెగా డీఎస్సీ నిర్వహిస్తామని ప్రకటించింది. అయితే పాత నోటిఫికేషన్‌ను రద్దు చేస్తే... సాంకేతికంగా సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్న అంచనాకు వచ్చింది. ముఖ్యంగా 1.77 లక్షల మంది అభ్యర్థులు ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకున్నందున.. వారి నుంచి ఆందోళన ఎదురవుతుందని భావిస్తున్నారు. ఈ సమస్య రాకుండా గత నోటిఫికేషన్‌కు అనుబంధంగా మరో నోటిఫికేషన్ జారీ చేయాలనే నిర్ణయానికి వచ్చారు. ఇందులో కొత్తగా చేర్చిన పోస్టుల వివరాలను పొందుపరిచి, అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవడానికి మరో అవకాశం ఇవ్వనున్నారు. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు మళ్లీ దరఖాస్తు చేయాల్సిన అవసరం ఉండదు.

విద్యార్థుల సంఖ్య ఎక్కువగా లేకపోయినా..

మెగా డీఎస్సీలో సుమారు 12 వేల ఉపాధ్యాయ పోస్టుల వరకు ఉండవచ్చని భావిస్తున్నారు. కొత్తగా చేర్చే వాటిలో స్పెషల్ టీచర్ పోస్టులు 1,523 వరకు ఉంటాయి. అదనంగా మరో 4,281 ఖాళీ పోస్టులను గుర్తించారు. వీటితోపాటు మోడల్ స్కూళ్లలో మరో 1,000 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు గుర్తించారు. గతంలో పదోన్నతులు కల్పించడం ద్వారా మరికొన్ని పోస్టులు ఖాళీ అయ్యాయి. వాటిని కూడా మెగా డీఎస్సీలో చేర్చనున్నారు. ప్రతి గ్రామ పంచాయతీలో ప్రభుత్వ పాఠశాల ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇప్పటికే అధికారులకు ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ విషయాన్ని కూడా దృష్టిలో ఉంచుకుని టీచర్ పోస్టుల భర్తీ ప్రక్రియను చేపడుతున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో కొన్ని పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఎక్కువగా లేదు. అయినప్పటికీ ఇలాంటి పాఠశాలల్లో ఉపాధ్యాయుల పోస్టులను ఉంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. రేషనలైజేషన్ ద్వారా ఇలాంటి పాఠశాలల్లోని పోస్టులను రద్దు చేయాలనే ప్రతిపాదన గతంలో ఉండేది. తాజాగా దీనిని ఉపసంహరించుకున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో మొత్తం 26 వేల పాఠశాలలు ఉండగా.. వీటిలో సుమారు 6వేల స్కూళ్లలో ఏకోపాధ్యాయుడే ఉన్నారు. మరో 1,290 పాఠశాలల్లో 'జీరో' అడ్మిషన్లు నమోదయ్యాయి. వీటన్నింటిలో ఖాళీల భర్తీ కోసం నిర్వహించే డీఎస్సీ పరీక్షలను రాష్ట్రం యూనిట్‌గా నిర్వహించనున్నారు. ఈ పరీక్షలో వచ్చిన మార్కుల ఆధారంగా జిల్లాల వారీగా మెరిట్ జాబితాను రూపొందించి.. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలోని కమిటీ ఉపాధ్యాయ పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేయనుంది. ఎలాంటి ఇంటర్వ్యూలు లేకుండా పరీక్షలో వచ్చిన మార్కుల ఆధారంగానే పోస్టుల భర్తీ జరగనుంది.

ఫిబ్రవరిలో మెగా డీఎస్సీ నిర్వహిస్తాం: కోమటిరెడ్డి



నల్లగొండ: ఫిబ్రవరిలో మెగా డీఎస్సీ నిర్వహిస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. గ్రూప్స్ పరీక్షలు కూడా నిర్వహిస్తామని, గత ప్రభుత్వంలో పేపర్ లీకులు జరిగినట్లుగా కాకుండా యూపీఎస్సీ తరహాలో వీటిని నిర్వహిస్తామని చెప్పారు. నిరుద్యోగులకు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేసి శిక్షణా తరగతులు నిర్వహిస్తామన్నారు.

ఘనంగా లక్ష్మీనరసింహస్వామి ప్రభోత్సవం

- సింహవాహన సేవలో లక్ష్మీనరసింహుని ఊరేగింపు


సింహవాహన సేవలో లక్ష్మీనరసింహుడు

కొల్లాపూర్, జనవరి 17 : లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి మండల పరిధిలోని సింగోటం గ్రామంలో లక్ష్మీనరసింహుని సింహ వాహన సేవ ఊరేగింపు నిర్వహించారు. బ్రహ్మోత్సవాలకు వివిధ ప్రాంతాల నుంచి హాజరైన భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. లక్ష్మీనరసింహుని ఆలయం నుంచి రత్నలక్ష్మీ ఆలయం వరకు సింహవాహన సేవ కొనసాగింది.

వరి పంట సాగుపై రైతులకు అవగాహన

తిమ్మాజిపేట, జనవరి 17 : తిమ్మాజిపేట మండల పరిధిలోని ఆవంచ గ్రామపంచాయతీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన రైతుల సమావేశంలో వరి పంట సాగుపై రావేఫ్ విద్యార్థినులు అవగాహన కల్పించారు. వరి పంటలో ప్రత్యేకంగా వెదజల్లే పద్ధతి డ్రమ్ సీడెడ్ టెక్నాలజీ, నర్సరీ నిర్వహణపై రైతులకు వివరించారు. అనంతరం రైతు సురేందర్‌రెడ్డి వ్యవసాయ పొలంలో జొన్న పంటపై క్షేత్ర ప్రదర్శన నిర్వహించారు. అదే గ్రామానికి చెందిన రాములు అనే రైతు తన వ్యవసాయ పొలంలో వేసిన మిరప పంటను పరిశీలించి పలు సూచనలు, సలహాలు చేశారు. రావేఫ్ విద్యార్థినులు జయశ్రీ, అంకిత, సఫురా, శ్రీజ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర సదస్సు వాల్‌పోస్టర్లు, కరపత్రాలు విడుదల

కందనూలు, జనవరి 17 : నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో తెలంగాణ జన సమితి రాష్ట్ర సదస్సు వాల్‌పోస్టర్లు, కరపత్రాలు బుధవారం రాష్ట్ర కమిటీ సభ్యుడు శ్యాంప్రసాద్‌రెడ్డి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 21న హైదరాబాద్‌లోని మోక్షగుండం విశ్వేశ్వరయ్య భవనంలో రాష్ట్ర విభజన హామీల అమలు కేంద్ర ప్రభుత్వ వివక్షతపై రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర అధ్యక్షుడు కోదండరామ్ హాజరవుతారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బండారు ఇంద్రారెడ్డి, తెలంగాణ జన సమితి నాయకులు ఆలకుంట వెంకటేశ్, రఘునందన్‌రెడ్డి, ఫులేందర్‌యాదవ్, చందు, సాయి, అరీఫ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ సీనియర్ నాయకుడు భగవంతు మృతి


భగవంతు మృతదేహంపై పూలమాలవేసి నివాళులర్పిస్తున్ననాయకులు

తెలకపల్లి, జనవరి 17 : సీపీఐ సీనియర్ నాయకులు మండల పరిధిలోని పెద్దపల్లికి చెందిన పెరుమాండ్ల భగవంతు(90) బుధవారం మృతి చెందారు. గతంలో భగవంతు సీపీఐ నియోజకవర్గ సెక్రటరీగా పని చేస్తూ ఎన్నో ఉద్యమాల్లో పాల్గొని ఆనాటి పెద్దలు నాగయ్యగౌడ్, కామ్రేడ్ లక్ష్మయ్యచారి, ఆనాటి నవాబ్‌కు వ్యతిరేకంగా ఎన్నో ఉద్యమాలు చేసుకుంటూ పేదలకు గైరాన్ భూములను పంచడం వంటి ఎన్నో కార్యక్రమాలు చేశారని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు కే కేశవులుగౌడ్ అన్నారు. ఆయన భౌతికకాయానికి పూల మాల వేసి నివాళులర్పించారు. పెద్దపల్లి గ్రామ సెక్రటరీ పి.బుగ్గస్వామి, సహాయ కార్యదర్శి బిచ్చల్, పెద్దలు రాములు, కరీం, మల్లేష్, పర్వతాలు, రాముడు, బాలకిష్ట తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు ఉచిత దర్శనం కల్పించాలి

కొల్లాపూర్, జనవరి 17 : సింగోటం లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలకు హాజరయ్యే భక్తులకు దేవాలయంలో ఉచిత దర్శనం కల్పించాలని బీజేపీ మండల అధ్యక్షుడు తమటం సాయికృష్ణగౌడ్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భక్తుల కోసం ఎలాంటి సౌకర్యాలు కల్పించకపోగా దేవాలయానికి వచ్చే భక్తుల దగ్గర హారతి టికెట్ వసూలు చేస్తున్నారని కుటుంబంలో ఎంతమంది వస్తే అంత మందితో బలవంతంగా హారతి టికెట్లు వసూలు చేస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. భక్తుల దగ్గర డబ్బులు వసూలు చేసి భక్తులను నిలువుదోపిడీ చేస్తున్నారని ఆలయ అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదన్నారు. తాము ఇలాగే వసూలు చేస్తామని ఆలయ అధికారులు చెప్పడం సిగ్గుచేటన్నారు. సింగోటం లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భక్తులకు ఉచిత దైవదర్శనం కల్పించాలని, దీనిపై మంత్రి జూపల్లి కృష్ణారావు స్పందించి భక్తుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని తమటం సాయికృష్ణగౌడ్ డిమాండ్ చేశారు.

నేటి నుంచి నిరంజన్ షావలీ ఉర్సు


గంధోత్సవంలో పాల్గొన్న స్థానిక మసీదు కమిటీ నాయకులు, ఎమ్మెల్యే వంశీకృష్ణ, మాజీ ఎంపీ డాక్టర్ మల్లు రవి

అచ్చంపేట, జనవరి 17: ప్రతీ సంవత్సరం జనవరి మాసంలో జిల్లాలోనే హిందూ ముస్లింల ఐక్యతను చాటే అతిపెద్ద జాతరగా మండల పరిధిలోని రంగాపూర్ గ్రామపరిధిలోని నిరంజన్ షావలీ ఉర్సు, ఉమామహేశ్వర బ్రహ్మోత్సవాలు జరుగుతాయి. ఈ జాతరకు ఉమ్మడి జిల్లా నుంచే కాక తెలంగాణ రాష్ట్రం నలుమూలల నుంచి పెద్ద ఎత్తున భక్తులు వచ్చి మొక్కులు తీర్చుకుంటారు. వారం రోజుల పాటు జరిగే బ్రహ్మోత్సవాలు, ఉర్సుకు వేలాదిగా భక్తులు తరలివస్తారు. దీనికి అనుగుణంగా అధికారులు ఏర్పాట్లను చేస్తారు. బుధవారం రాత్రి పట్టణంలోని మనుప టేల్ ఇంటి నుంచి రంగాపూర్ నిరంజన్ షావలీ దర్గాకు గంధం తరలివెళ్లింది. ఈ సందర్భంగా విద్యుత్ దీపాలతో అలకరించిన గంధాలను పట్టణ పురవీధుల గుం డా ఊరేగింపుగా గురువారం తెల్లవారుజాము వరకు నిరంజన్ షావలీ దర్గాకు చే రుకుంటుంది. హిందూ ముస్లింలు ఆడుతూ పాడుతూ ఆనోందత్సవాల మధ్య గంధాన్ని తరలిస్తారు. నియోజకవర్గంలోని అమ్రాబాద్, మన్ననూర్, బోమ్మన్‌పల్లి తదితర గ్రామాలనుంచి కూడా గంధాలు తరలివస్తాయి.

ఘనంగా గంధోత్సవం

● అమ్రాబాద్: మండల కేంద్రంలో రంగాపూర్ హజ్రత్ నిరంజన్ షావలీ గంధోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. గత కొన్ని దశాబ్దాల నుంచి కేంద్రంలోని అమీర్ అలీ ఇంటి వద్ద స్థానిక మజీద్ కమిటీ గంధోత్సవ కమిటీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తారు. బుధవారం సాయంత్రం ప్రత్యేక ప్రార్థనలు చేసిన అనంతరం విద్యుత్ దీపాలతో అలంకరించిన వాహనం ముందు గుర్రం పైన ఉంచిన గంధోత్సవాన్ని ఊరేగింపుగా తీసుకువెళ్లారు. రాత్రి పొద్దుపోయే వరకు మండల కేంద్రంలో అత్యంత వైభవంగా నిర్వహించిన గంధోత్సవంలో స్థానిక ముస్లిం ప్రజలతో పాటు మండల పరిధిలోని వివిధ వర్గాల ప్రజలు భారీ సంఖ్యలో హాజరై గంధంను దర్శించుకుని మొక్కుబడులను తీర్చుకున్నారు. అమ్రాబాద్ నుంచి వెళ్లిన గంధం రంగాపురం నిరంజన్ షావలీ దర్గా వద్దకు గురువారం తెల్లవారుజామున చేరుకున్న తర్వాతనే అక్కడ ఉత్సవాలు ప్రారంభమవతాయని అమ్రాబాద్ మజీద్ కమిటీ నేతలు నాయక్ సర్దార్ ఇదాయత్ అలీ విలేకరులకు తెలిపారు. అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ, నాగర్ కర్నూల్ మాజీ ఎంపీ డాక్టర్ మల్లు రవి, వివిధ పార్టీల ప్రముఖులు హాజరై ప్రార్థనలు జరిపారు.

● మన్ననూర్: అమ్రాబాద్ మండలం మన్ననూరు గ్రామంలో గంధోత్సవాలను బుధవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ హాజరయ్యారు. ఈ సందర్భంగా స్థానిక మసీదు కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు శాలువా కప్పి సన్మానించారు. గంధం వద్ద ఎమ్మెల్యే పూజలు నిర్వహించి గంధం వాహనాన్ని ప్రారంభించారు. ప్రత్యేక విద్యుత్తు దీపాలతో అలంకరించిన గంధాన్ని పురవీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. అనంతరం దర్గాకు చాదర్, పూలు, గంధం సామగ్రిని మన్ననూరు జామే మసీదు తరఫున తీసుకెళ్లారు. ఎంపీపీ శ్రీనివాసులు, గ్రామ సర్పంచి శ్రీరాం నాయక్, ఎంపీటీసీ సభ్యులు దాసరి శ్రీనివాసులు, బాలమ్మ, కోఆప్షన్ సభ్యుడు రహీం, మసీదు కమిటీ నాయకులు నసీరొద్దీన్, సాజన్, జాకీర్, రవూఫ్, నిరంజన్, వాజిద్ పాల్గొన్నారు.

సోమశిల లింకు రోడ్డును

వేంకటేశ్వరాలయ రోడ్డుకు కలుపుతా

- మంత్రి జూపల్లి కృష్ణారావు


రోడ్డును పరిశీలిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

పెంట్లవెల్లి, జనవరి 17 : సోమశిల లింకు రోడ్డును రామాపురం వేంకటేశ్వరస్వామి దేవాలయం లింకురోడ్డుకు కలుపుతానని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. బుధవారం కొల్లాపూర్ మండలం రామాపురం గ్రామంలో వేంకటేశ్వరాలయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆలయానికి చుట్టూ ముట్టూ రేలింగ్ ఏర్పాటుతో పాటు ఆలయ సమీపంలో వంటశాల ఏర్పాటు చేస్తానని వారు పేర్కొన్నారు. ఆదేవిధంగా రామాపురం నుంచి టెంపుల్‌కు వెళ్లే దారిలో బ్రిడ్జి ఏర్పాటుతో పాటు సీసీ రోడ్డు వేయిస్తానని వారన్నారు. అదేవిధంగా గ్రామ పంచాయతీ దగ్గర ఉన్న ఆట స్థలానికి చుట్టూ కాంపౌండ్ వాల్ ఏర్పాటు చేస్తానని వారు పేర్కొన్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా వాలీబాల్ పోటీల్లో గెలుపొందిన యువకులకు ప్రథమ, ద్వితీయ బహుమతులు అందజేశారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఆకునమోని రాము యాదవ్, కొమ్ము రాజుయాదవ్, మాజీ సర్పంచ్ బచ్చలకూర బాలరాజు, కాంగ్రెస్ నాయకులు నల్లవెల్లి రామస్వామి, చంద్రయ్య, ఎల్‌ఐసీ నాగరాజు, కలమూరి మధు, గడ్డం శేఖర్, సాకలి చెన్నయ్య, శేఖర్‌గౌడ్, గడ్డం అశోక్, ఉడత రామస్వామి, ఉడత గోపాల్, కాకి రాముగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బండలాగుడు పోటీలు ప్రారంభం

కోడేరు: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని మండల కేంద్రంలో బుధవారం ఎద్దుల బండలాగుడు పోటీలను రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రారంభించారు. మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో ఎద్దుల బండలాగుడు పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడారు. ఈ పోటీల్లో మొదటి బహుమతి 80వేలు నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన అఖిలేష్‌రెడ్డి గెలుచుకోగా రెండవ బహుమతి 60వేలు కొత్తకోట గ్రామానికి చెందిన ఎ.గురునాథ్ ఎద్దులు గెలుచుకున్నాయి. మూడవ బహుమతి 50వేలు తిరుమలేష్, నాల్గవ బహుమతి 40వేలు వినిల్‌నాయుడు, ఐదవ బహుమతి 30వేలు వడ్డెమాన్ సుధాకర్‌రెడ్డి కంచుపాడు, ఆరవ బహుమతి 20వేలు ఎం.గోపాలకృష్ణ పెద్దదగడ, 7వ బహుమతి 15వేలు భాస్కర్‌గౌడ్ ఆయిజ గ్రామం, 8వ బహుమతి 10వేలు వష్టి పెద్దబాలయ్య ఎద్దులు గెలుచుకున్నాయి. మాజీ ఎంపీపీ కొత్త రామ్మోహన్‌రావు, సింగిల్ విండో డైరెక్టర్ ఎస్.మహేశ్వర్‌రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు మండల పరిషత్ కోఆప్షన్ మెంబరు ఎస్‌కే.బాబు, మాజీ ఎంపీటీసీ శ్రీను, ఎంపీటీసీ గడ్డం నరసింహ్మ, జగదీశ్వర్‌రావు, ఆదికుర్మయ్య తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి అవార్డుకు అప్పాజీపల్లి ఎంపిక

- సర్పంచ్‌కు పలువురి అభినందనలు



బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షుల ద్వారా ఆహ్వాన పత్రికను అందుకుంటున్న సర్పంచ్ జల్లి తిరుపతమ్మ రమేష్

తిమ్మాజిపేట, జనవరి 17: తిమ్మాజిపేట మండల పరిధిలోని అప్పాజీపల్లి 2024కు గాను జాతీయ స్థాయి ఉత్తమ సర్పంచ్ అవార్డుకు ఎంపికైంది. బహుజన సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన జల్లి తిరుపతమ్మకు జాతీయ అధ్యక్షుడు నల్ల రాధాకృష్ణ ఆహ్వాన పత్రికను అందజేశారు. ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతిలో ఫిబ్రవరి 11న నిర్వహించే బహుజన రైటర్స్ ఏడవ సౌత్ ఇండియా కాన్ఫరెన్స్‌లో ఉత్తమ సర్పంచ్‌గా ఎంపిక కాబడిన జల్లి తిరుపతమ్మకు జాతీయ అవార్డు అందజేయనున్నారు. గతేడాది ఆగస్టు 15న జిల్లా స్థాయిలోనూ స్వచ్ఛ సర్వేక్షణ్ పథకంలో భాగంగా గ్రామంలో అభివృద్ధి పారిశుధ్య పనులు విజయవంతంగా చేపట్టడంతో రాష్ట్ర స్థాయిలో తమ గ్రామపంచాయతీ అవార్డులు దక్కించుకోగా గ్రామాభివృద్ధి పనుల కోసం పది లక్షలు తెలంగాణ ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ సందర్భంగా సర్పంచ్ జల్లి తిరుపతమ్మ బుధవారం విలేకర్లతో మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థుల సహకారంతో వందశాతం మరుగుదొడ్లు నిర్మించి గ్రామాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దానని జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో తనకు అవార్డులు రావడం ఎంతో సంతృప్తినిచ్చిందన్నారు. గ్రామంలో అభివృద్ధి పనులు చేస్తూ జాతీయ స్థాయిలో గ్రామానికి గుర్తింపు తెచ్చి అవార్డులు అందుకోవడం హర్షదాయకమని గ్రామస్థులు, ఆయా పార్టీల నాయకులు అభినందనలు తెలిపారు.

సుబ్బయ్యకు పద్మశ్రీ ప్రకటించేలా ప్రభుత్వం కృషి చేయాలి



వజ్రోత్సవాల నిర్వహణకు రూ.2.5 లక్షల ఆర్థిక సాయం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

బిజినేపల్లి, జనవరి 17 : ఆరు దశాబ్దాల కిందటే నిరుపేదలకు ఉచిత విద్యను అందించిన తోటపల్లి సుబ్రమణ్యం శర్మ (సుబ్బయ్య)కు ప్రభుత్వం పద్మశ్రీ అవార్డు ప్రకటించేందుకు ఉన్నత స్థాయిలో ఉన్న పూర్వ విద్యార్థులు కృషి చేయాలని పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు బుడ్డయ్య, కార్యదర్శి మోహన్‌బాబు కోరారు. మండలంలోని పాలెంలోని టీఎస్‌ఎం హైస్కూల్ ఆవరణలో బుధవారం పాలెం విద్యాసంస్థల వజ్రోత్సవాల నిర్వహణ కమిటీ 14వ సన్నాహక సమావేశం నిర్వహించి మాట్లాడారు. 1963 నుంచి 2023 వరకు పాఠశాల, కళాశాలల్లో చదువుకున్న పూర్వ విద్యార్థులు పెద్ద సంఖ్య హాజరయ్యే వారందరికీ అవసరమైన వసతుల కల్పనకు, పూర్వపు అధ్యాపకులు, ప్రముఖులకు సన్మానాలు, పూర్వ విద్యార్థులతో పాలెం గ్రామంలో ప్రభావత్ నిర్వహణ, పాలెం విద్యాసంస్థలను స్థాపించిన సుబ్బయ్య చరిత్రపై సావనీర్ పుస్తకం ప్రచురణ వంటి అంశాలతో ఎజెండా రూపొందించారు. ఇప్పటికే కళాశాల, పాఠశాలలకు కలర్స్ వేయించినట్లు కమిటీ సభ్యులు పేర్కొన్నారు. వజ్రోత్సవాల నిర్వహణ కోసం పూర్వ విద్యార్థులు కాశిరెడ్డి గోపాల్ రెడ్డి, రిటైర్డ్ ప్రిన్సిపాల్ కృష్ణగౌడ్, జగన్ మోహన్, వస్పరి శివుడు, ఎంపీపీ శ్రీనివాస్ గౌడ్‌లు రూ.2.5 లక్షల నగదును సమీకరించి అందజేశారు. అలాగే ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి రూ.లక్ష నగదును ఉప సర్పంచ్ చికొండ్ర రాములు ద్వారా అందజేశారు. బ్యాచ్‌ల వారీగా పలువురు పూర్వ విద్యార్థులు ఆర్థిక సాయం అందజేసినట్లు కోశాధికారులు శ్రీనివాస్ రెడ్డి, లక్ష్మీకాంత్‌లు తెలిపారు. అనంతరం వజ్రోత్సవాల నిర్వహణపై పలువురు పూర్వ విద్యార్థులు సూచనలు, సలహాలు ఇచ్చారు. వెంకన్న ఆలయ చైర్మన్ జున్న శేఖర్‌రెడ్డి, పూర్వ విద్యార్థులు బాలకిష్టయ్య, హనుమంత్‌రావు, డాక్టర్ మల్లికార్జున్, నిరంజన్, వంగ ఆంజనేయులు గౌడ్, లక్ష్మీనారాయణ, దామోదర్ రెడ్డి, గోపాల స్వామి, రామచందర్, సొప్పరి కాశన్న తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

- కేంద్ర ప్రభుత్వ డిప్యూటీ సెక్రటరీ జీప రఘువంశి



సమావేశంలో మాట్లాడుతున్న రఘువంశి

వెల్దండ, జనవరి 17 : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని కేంద్ర ప్రభుత్వ డిప్యూటీ సెక్రటరీ జీపీ రఘువంశి సూచించారు. బుధవారం మండల పరిధిలోని చెర్కూర్, బర్కత్‌పల్లి గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్ప్ యాత్రలో భాగంగా గ్రామసభలు నిర్వహించి కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమానికి కేంద్ర సహాయ కార్యదర్శి ప్రీతిబాలాతో కలిసి రఘువంశీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి ప్రజలలో పథకాలపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రధానంగా మహిళలు ఆర్థికాభివృద్ధి చెందేందుకు ఈ పథకాలు ఎంతగానో ఉపయోగపడుతాయని పేర్కొన్నారు. గ్రామాల్లో స్వచ్ఛభారత్, ఉజ్వల పథకం ద్వారా సిలిండర్ల పంపిణీ, ఆయుష్మాన్ భారత్, ప్రధానమంత్రి ఆవాస్ యోజన, ఫసల్ బీమా వంటి పథకాలు ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతాయని అన్నారు. 2047 వరకు భారత్ అభివృద్ధి చెందిన దేశంగా నిలుస్తుందని రఘువంశీ పేర్కొన్నారు. బర్కత్‌పల్లి గ్రామంలో నిర్వహించిన వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించారు. సర్పంచ్‌లు రేవతి, బీరయ్య, జిల్లావైద్యాధికారి సుధాకర్‌లాల్, డీఆర్‌డీవో నర్సింగరావు, జేడీ వెంకటేశ్వర్లు, ఎల్‌డీఎం కౌశల్ కిషోర్‌పాండే, ఏపీడీ లక్ష్మీనారాయణ, డీపీఎంలు నర్సింహులు, శ్రీనివాస్, ఎంపీడీవో శ్రీనివాసులు, డాక్టర్ స్వరూప, ఏవో మంజుల, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు భారతమ్మ, ఏపీఎం రాములు, ఏపీవో ఈశ్వర్, ఉపసర్పంచ్ నర్సింహ తదితరులు ఉన్నారు.

వెంకన్న బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు


పాలెం వెంకన్న ఆలయంలో మాట్లాడుతున్న ఆలయ చైర్మన్ జున్న శేఖర్ రెడ్డి

బిజినేపల్లి, జనవరి 17 : పాలెం వెంకన్న స్వామి బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ కమిటీ చైర్మన్ జున్న శేఖర్ రెడ్డి అన్నారు. మండలంలోని పాలెంలోని అలువేలు మంగ సమేత వేంకటేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలను ఫిబ్రవరి 11 నుంచి 18 వరకు నిర్వహించనున్నట్లు బుధవారం తెలిపారు. ప్రతీ ఏడాది పెరుగుతున్న భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కల్గకుండా బ్రహ్మోత్సవాలను ప్రశాంతంగా నిర్వహించేలా ప్రణాళిక రూపొందించుకున్నామన్నారు. ఈసారి 4 వేలకు పైగా భక్తులకు అన్నదానం, 500 మంది కల్యాణోత్సవాలు జరిపేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. బ్రహ్మోత్సవాల నిర్వహణకు అవసరమయ్యే నిధుల సేకరణకు ఆలయ కమిటీ సభ్యులు ప్రముఖులను, దాతలను కలిసి సానుకూలంగా స్పందిస్తున్నట్లు సంతోషం వ్యక్తం చేశారు. అలాగే హెచ్‌ఈఎస్ కంపెనీ ఆర్థిక సాయంతో నిర్మించిన అర్చకుల వసతి గృహాలను ఈనెల ఆఖరు వరకు పెండింగ్ పనులను పూర్తి చేసి అర్చకులకు అప్పగించనున్నట్లు తెలిపారు. ఈవో సీహెచ్ రంగారావు, ఆలయ కమిటీ సభ్యులు సొప్పరి బాలస్వామి, పెద్ద కురుమయ్య, గాడి సురేందర్, గంధం నిఖిత వెంకటేశ్వర్లు, గోపాల స్వామి, ప్రధాన అర్చకులు కొరవి రామానుజాచార్యులు, జయంత్, చక్రపాణి పాల్గొన్నారు.

నేడు కల్వకుర్తిలో మెగా రక్తదాన శిబిరం

కల్వకుర్తి, జనవరి 17 : కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు కల్వకుర్తి మాజీ సర్పంచ్ బ్యాంగి ఆనంద్‌కుమార్ తెలిపారు. శిబిరంలో కాంగ్రెస్ కార్యకర్తలు, ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి అభిమానులు రక్తదాతలు స్వచ్ఛందంగా తరలి వచ్చి రక్తదానం చేయాలని ఆయన కోరారు.

చిన్నారిని పరామర్శించిన ఎమ్మెల్యే సతీమణి


చికిత్స పొందుతున్న బాలున్ని పరామర్శించిన అనురాధ

అచ్చంపేటటౌన్, జనవరి 17: అచ్చంపేట పట్టణానికి చెందిన ఖాజా కుమారుడు ప్రమాదవశాత్తు కరెంట్‌కు గురై హైదరాబాద్‌లో సంరక్షణ ఉమెన్స్ అండ్ చిల్డ్రన్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడు. ఈ బాలున్ని ఎమ్మెల్యే సతీమణి, జడ్పీటీసీ సభ్యురాలు అనురాధ బుధవారం పరామర్శించారు. బాలుడి ఆరోగ్య పరిస్థితులపై వైద్యులను అడిగి తెలుసుకొని మెరుగైన వైద్యం అందించాలన్నారు.

డిగ్రీ కళాశాలలో దరఖాస్తుల ఆహ్వానం

కల్వకుర్తి, జనవరి 17 : కల్వకుర్తి పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డైరీ సైన్స్ సబ్జెక్టు బోధించడానికి అర్హులై అనుభవం గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు మోడల్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శర్వాణి ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు తమ దరఖాస్తులను ఈ నెల 19న సాయంత్రం 4గంటల లోపు కళాశాలలో అందజేయాలని ప్రిన్సిపాల్ కోరారు.

'కల్వకుర్తి మార్కెట్ చైర్మన్ పదవిని వంగూరు మండలానికి కేటాయించాలి'

కల్వకుర్తి, జనవరి 17 : కల్వకుర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని వంగూరు మండలానికి కేటాయించాలని కాంగ్రెస్ వంగూరు మండల ప్రధాన కార్యదర్శి మామిడాల ముత్యాల్‌రెడ్డి కోరారు. కల్వకుర్తి పట్టణంలో బుధవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాను ఎన్నో ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీ కోసం పని చేశానని, మార్కెట్ చైర్మన్ పదవికి తనకు కేటాయించాలని కోరారు. అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ స్పందించి తగిన న్యాయం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

పెద్దకొత్తపల్లి, జనవరి 17 : మండల పరిధిలోని మరికల్ గ్రామానికి చెందిన కాకం తిక్కన్న కుమారుడు కాకం వెంకటయ్య గత ఆరు రోజుల క్రితం అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషయం తెలుసుకున్న ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్ మరికల్ గ్రామంలోని మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కుటుంబానికి పదివేల రూపాయల నగదును సహాయంగా అందజేశారు. ఆయన వెంట పెద్దకొత్తపల్లి సింగిల్ విండో చైర్మన్ బుడుగు శ్రీనివాసులు, మరికల్ వార్డు మెంబరు కొల్లే ఈశ్వర్ తదితరులు ఉన్నారు.

విద్యుదాఘాతానికి గురై లేగదూడ మృతి

పెద్దకొత్తపల్లి, జనవరి 17: మండల పరిధిలోని జొన్నలబొగుడ గ్రామానికి చెందిన కద్దాల దేవమ్మ అనే మహిళా రైతుకు చెందిన లేగదూడ(ఆవుదూడ) బుధవారం ప్రమాదవశాత్తున విద్యుత్‌షాక్‌కు గురై మృతి చెందినట్లు ఆ గ్రామస్థులు తెలిపారు. గ్రామ సమీపంలో పశువులను మేపుకురావడానికి వెళ్లడంలో హైజంక్షన్ వైర్లకు తగిలి లేగదూడ మృతి చెందింది. మృతి చెందిన లేగదూడ విలువ దాదాపు 30వేలు ఉంటుందని గ్రామస్థులు తెలిపారు. ప్రభుత్వం తమకు నష్ట పరిహారం చెల్లించి ఆదుకోవాలని బాధితురాలు కోరారు.

'క్రీడాకారులను ప్రోత్సహిస్తాం'

ఊర్కొండ, జనవరి 17: క్రీడాకారులను ప్రోత్సహిస్తామని సర్పంచ్ తలసాని అనిల్ రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని జకినాలపల్లిలో క్రికెట్ వాలీబాల్ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ తలసాని అనిల్‌రెడ్డి క్రీడాకారులను పరిచయం చేసుకున్న అనంతరం పోటీలను ప్రారంభించారు. గెలుపొందిన టీంకు రూ. 10,000 అందజేశారు. స్థానిక క్రీడాకారులు నాయకులు పాల్గొన్నారు.

'రామమందిరంపై బీజేపీ రాజకీయం'

వంగూరు, జనవరి 17: అయోధ్యలోని రామమందిరం ప్రతిష్ఠాపన పట్ల బీజేపీ రాజకీయంగా వాడుకుంటోందని అచ్చంపేట అసెంబ్లీ యూత్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ క్యామ మల్లయ్య అన్నారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ బీజేపీ ఆలయ నిర్మాణం పూర్తికాకముందే రానున్న పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ప్రతిష్ఠాపన చేయడం సమంజసంగా లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ పట్ల బీజేపీ విషం చిమ్ముతోందన్నారు. ఇండియా కూటమి పటిష్ఠంగా ఉందని వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని ఓడిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

అయోధ్య రాముడి అక్షింతలు పంపిణీ


అక్షింతలతో బయలుదేరుతున్న భక్తులు

వంగూరు, జనవరి 17: అయోధ్య నుంచి వచ్చిన స్వామివారి అక్షింతలను మండలంలోని తిప్పారెడ్డిపల్లిలో ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులు భజన, ఆటపాటలతో అక్షింతలను ఇంటింటికి పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ వేముల శిరీష, వెంకటేశ్వర్‌రావు, యుగేందర్‌రావు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరం విజయవంతం


శిబిరంలో చికిత్స చేస్తున్న వైద్యులు

వెల్దండ, జనవరి 17 : మండల పరిధిలోని కొట్ర సమీపంలోని శ్వేత ఫ్యూయల్‌స్టేషన్ ఆధ్వర్యంలో ఎస్వీ యెన్నం ఆస్పత్రివారి సహకారంతో బుధవారం నిర్వహించిన వైద్యశిబిరం విజయవంతమైంది. శిబిరాన్ని సర్పంచ్ యెన్నం భూపతిరెడ్డి ప్రారంభించారు. వివిధ గ్రామాలనుంచి వచ్చినవారికి సాధారణ వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. గ్రామాల్లో నిరుపేదలకు ఉచిత వైద్యశిబిరాలు ఎంతగానో ఉపయోగపడుతాయని ఈ సందర్భంగా భూపతిరెడ్డి పేర్కొన్నారు. ఆర్యవైశ్యసంఘం జిల్లా అధ్యక్షుడు బచ్చు రామకృష్ణ, సర్పంచ్ రాంచంద్రారెడ్డి, నిర్వాహకులు రామోజు శ్వేత, లక్ష్మీనారాయణచారి, సంతోష్, యెన్నం అంజన్‌రెడ్డి, ఉప్పు ఆంజనేయులు, అలీ, నారాయణ తదితరులు ఉన్నారు.

ఘనంగా బండ్ల బోనాలు


ఊరేగింపునకు తీసుకెళ్తున్న ఎద్దుల బండి

వంగూరు, జనవరి 17; సంక్రాంతి పండగ సందర్భంగా మంగళవారం రాత్రి ఉల్పరలో గ్రామస్థులు హన్‌మాన్ దేవాలయం, చెన్నకేశవస్వామి స్వాములకు బండ్ల బోనాలు ఘనంగా నిర్వహించారు. వైభవంగా సాగిన బండ్ల బోనాల ఊరేగింపు ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది. స్వామి వారి ఆలయాల చుట్టూ బండ్లను తిప్పి భక్తిని చాటుకున్నారు. సుఖ శాంతులతో అష్టైశ్వర్యాలతో ఉండేలా చల్లని చూపు ఉండాలని స్వాముల వారికి గ్రామస్థులు ప్రత్యేక పూజలు చేశారు. నాయకులు, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ముగ్గుల పోటీ విజేతలకు బహుమతులు

వెల్దండ, జనవరి 17 : మండల పరిధిలోని బర్కత్‌పల్లి గ్రామంలో మల్కేడి వీరోజు స్మారకార్థం నిర్వహించిన ముగ్గుల పోటీలు విజయవంతమయ్యాయి. పోటీలకు గ్రామంలోని మహిళలు, యువతులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజేతలుగా నిలిచిన మహిళలకు నిర్వాహకుడు మల్కేడి రాజు నగదు బహుమతులు అందజేశారు. అదేవిధంగా పోటీలో పాల్గొన్న ప్రతీ ఒక్కరికి కన్సోలేషన్ బహుమతులు అందజేశారు. ఉపసర్పంచ్ నర్సింహ ఉన్నారు.

ఆదర్శ యూత్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక

తెలకపల్లి, జనవరి 17 : మండల పరిధిలోని ఆలేరులో గత 15ఏళ్లుగా వివిధ సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఆదర్శ యూత్ నూతన కార్యవర్గం ఎన్నికైంది. అధ్యక్షుడుగా ఓయూ రీసెర్చ్ స్కాలర్ పి.రాజీవ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా ఎం.రమేష్, ఉపాధ్యక్షునిగా పి.ప్రవీణ్, కోశాధికారిగా వార్డు సభ్యులు బి.మల్లేష్, కార్యవర్గ సభ్యులుగా బి.గణేష్, బి.నరేష్, బి.కుమార్, బి.శివ, ప్రచార కార్యదర్శులుగా ఎం.ఎల్లస్వామి, పి.భాస్కర్‌లు ఎన్నికయ్యారు.

నేటి నుంచి అజ్మీర్ దర్గా ఉత్సవాలు

వంగూరు, జనవరి 17; మండలంలోని పోల్కంపల్లి-కొండారెడ్డిపల్లి రహదారిలో కేఎల్‌ఐ కాల్వ బ్రిడ్జి సమీపంలో వెలసిన అజ్మీర్ దర్గా ఉత్సవాలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా దర్గాకు కలర్ వేసి, విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు. గురువారం సాయంత్రం 6 గంటలకు పోల్కంపల్లి నుంచి గంధోత్సవం ఊరేగింపుతో బాజాభజంత్రిలతో వైభవంగా దర్గాకు చేరుతుందని దర్గా గురువు ఖాజాషాసిద్దిక్, నిజామ్ తెలిపారు. ఈ దర్గా ఉత్సవాలకు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా భక్తులు వచ్చి స్వామి వారిని దర్శించుకొని మొక్కుబడులు తీర్చుకుంటారు. దర్గా వద్ద భక్తులకు అన్నాదానం కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు కమిటీ సభ్యుడు నిజామోద్దీన్ తెలిపారు.

కొనసాగుతున్న ఈదమ్మ మాందాత ఉత్సవాలు

వెల్దండ, జనవరి 17 : మండల పరిధిలోని చెర్కూర్ గ్రామంలో ఈదమ్మ మాందాత, మాతంగి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. బుధవారం రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ఆయన పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. నారాయణపూర్ సర్పంచ్ అంజినాయక్, మాజీ ఎంపీటీసీ భీమయ్యగౌడ్, ఉపసర్పంచ్ నర్సింహ, నాయకులు మైసయ్య, సత్యం, అలీవోద్దిన్, శ్రీనునాయక్, ప్రశాంత్, రాంచందర్‌గౌడ్, లాలయ్య, శ్రీను ఉన్నారు.